క్లుప్తంగా

రైతు రక్షణ సమితి మండల అధ్యక్షుడిగా రమేష్



కమలాపూర్: తెలంగాణ రైతు రక్షణ సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన నూనె రమేష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ తెలిపారు. రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఆదేశాల మేరకు రమేష్‌కు శనివారం నియామకపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కిషన్‌రావు, భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు: మండలంలోని రాంనగర్, ఐనవోలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో పిడుగు చిన్నకొమురమ్మ, రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల గోపాల్, మహ్మద్ రషీద్‌లు వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్, గడ్డం శివరాం ప్రసాద్, నాయకులు ఉన్నారు.

శఠగోపం బహూకరణ



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుగొండకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి–స్వప్నదేవి దంపతులు రూ.75 వేల విలువైన శఠగోపాన్ని స్వామివారికి బహూకరించి ప్రత్యేక పూజలు చేశారు. నిమ్స్ లైజనింగ్ అధికారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో ఎంపీపీ బీమగాని సౌజన్య, నాయకులు మల్రెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, నల్ల సురేశ్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: బేగంపేట, రామంతాపూర్‌లలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో (హెచ్‌పీఎస్) 1వ తరగతి డేస్కాలర్ ప్రవేశానికి హనుమకొండ జిల్లాలోని ఎస్సీ బాలికల నుంచి 2024 –2025వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25నుంచి మార్చి 12వ తేదీలోపు దరఖాస్తులను హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లోని జిల్లా సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, అలాగే హసన్‌పర్తిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

శ్రీనివాస్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు

శాయంపేట : భూమి విషయంలో మిగిలిన డబ్బులు చెల్లించాలని అడగడంతో కులం పేరుతో దూషించగా బాధితుడు ఫిర్యాదు మేరకు పరకాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శాయంపేటకు చెందిన మారెపల్లి సుమన్‌కు హనుమకొండ పట్టణంలోని గోపాలపురంలో ప్లాట్ ఉండగా తన అవసరాల నిమిత్తం భూమి అమ్మకానికి పెట్టగా కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి రూ.17 లక్షలకు కొనుగోలు చేశాడు. భూమి అమ్మిన సమయంలో సుమన్‌కి రూ.11 లక్షలు చెల్లించి మిగతా రూ.6 లక్షలకు ఒక నెల గ డువు పెట్టినట్లు తెలిపారు. గడువు ముగియడంతో సుమన్ తనకు రావాల్సిన డబ్బులు అడగగా రేపు మాపు అంటూ దాట వేస్తున్నట్లు తెలి పారు. ఈ నెల 7న డబ్బుల కోసం సుమన్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేయగా కులం పేరుతో దూషించి చంపుతా అని బెదిరించినట్లు తెలి పారు. సుమన్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జనం నుంచి వనంలోకి..

- తల్లులకు మనసారా మొక్కుకున్న భక్తులు
- చివరి రోజు పెరిగిన రద్దీ
- ముగిసిన సమ్మక్క–సారలమ్మ జాతరలు



ఆత్మకూరు: సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఎల్కతుర్తి: ముల్కనూర్‌లో అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర శనివారం నాలుగవ రోజు కొనసాగింది. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 30 లక్షల మంది భక్తులు రావచ్చని అధికారులు అంచనా. రాత్రి దేవతల వనప్రవేశం వైభవంగా జరిగింది. పూజారులు గోనెల సారంగపాణి, వెంకన్న, గుల్లపెల్లి సాంబశివరావు తదితర పూజారులు ప్రత్యేక తంతుతో సమ్మక్క–సారలమ్మ తల్లులను వనప్రవేశం చేయించారు.జాతర పర్యవేక్షణలో ఆర్డీఓ శ్రీనివాస్, సీఐ సంతోష్, ఈఓ శేషగిరి, చైర్మన్ రమేష్ ఉన్నారు. శనివారం కూడా భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మద్యం వ్యాపారులు ధరలు పెంచారని భక్తులు ఆరోపించారు. ఒక్కో మద్యం సీసాపై రూ.100 అదనంగా తీసుకుంటున్నారని మద్యం ప్రియులు వాపోయారు. అధిక ధరలకు మద్యం అమ్మినా కూడా ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమీక్ష సమావేశాల్లో ఎన్నిసార్లు సూచనలు చేసినా అధికారులు పెడచెవిన పెట్టారన్నారు. జాతర నిర్వహణలో సమన్వయ లోపం కనిపించిందని భక్తులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ముగిసిన వనదేవతల జాతర

ఎల్కతుర్తి: గత మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క–సారలమ్మ వనదేవతల జాతర ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, పలు శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం చివరి రోజున భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, కొత్తకొండ, ఎల్కతుర్తి మండలంలోని దామెరలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకొని ఎత్తుబంగారం (బెల్లం), చీరసారె, పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే జీపీ కార్మికులు జాతర ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సేవలు అందించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. సాయంత్రం అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వనంలోకి సాగనంపారు. దీంతో జాతర వేడుకలు ముగిశాయి. వేడుకల్లో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనితరమేష్, జెడ్పీటీసీ వంగ రవిందర్, జాతర కమిటీ చైర్మన్‌లు ఠాగూర్ రామ్‌సింగ్, మాడుగుల కొమురయ్య, కొలుగూరి రాజు, ఆధారి రవీందర్, చల్లా రవీందర్‌రెడ్డి, చల్లా రమ్మారెడ్డి, మహేందర్, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: వనం నుంచి జనంలోకి వచ్చి మూడు రోజుల పాటు భక్తులకు దర్శనమిచ్చి మొక్కులు అందుకున్న వనదేవతలు సమ్మక్క–సారలమ్మలు శనివారం తిరిగి వనప్రవేశం చేశారు. మొక్కుల అనంతరం కమలాపూర్, కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో గద్దెలపై ప్రతిష్ఠించిన వన దేవతలను నిర్వాహకులు తిరిగి వన ప్రవేశం చేయించడంతో జాతర ముగిసింది. వనదేవతలు వనప్రవేశం చేయగానే భక్తులు ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. కార్యక్రమాల్లో జాతర ఉత్సవ కమిటీ చైర్మన్లు ఆన్‌కార్ అశోక్, నల్లాని సురేష్, బండి అంజయ్య, చందబోయిన రాజు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, జాతర ఉత్సవ కమిటీ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్‌లో జరుగుతున్న జాతర సమ్మక్క–సారలమ్మ జాతర ప్రశాంతంగా ముగిసినట్లు జాతర కమిటీ చైర్మన్ రాయిడి రాజిరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం పూజారులు సమ్మక్క–సారలమ్మ తల్లులను డప్పుచప్పుళ్లతో తిరిగి వనంలోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : గత మూడు రోజులుగా పూజలు అందుకున్న సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజులు గద్దెలపై నుంచి తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని జోగంపల్లిలో జాతర ప్రారంభమైంది. తల్లులు గద్దెలపై కొలువుతీరడంతో శనివారం చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు సందర్శించి తల్లులకు నిలువెత్తు బంగారం, మొక్కులు చెల్లించుకున్నారు. తహసీల్దార్ సుభాషిణి సందర్శించి జాతరను పర్యవేక్షించారు. శనివారం రాత్రి సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజును మేడారం నుంచి వచ్చిన పూజారి రాజక్క ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి గద్దెలపై నుంచి వనప్రవేశం చేయడంతో జాతర ముగిసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి తెలిపారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జాతర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: తల్లులను వనప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు



ఎల్కతుర్తి : అమ్మవార్లను గద్దెనుంచి చిలకల గుట్టకు తరలిస్తున్న కోయ పూజారులు



నడికూడ : దేవతలను వనంలోకి తీసుకెళ్తున్న పూజారులు



శాయంపేట: అమ్మవార్లను వనప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు

పరకాలలో సీఎస్ఐ శతజయంతి ఉత్సవాలు

- యేసు స్మరణతో క్రైస్తవుల భారీ ర్యాలీ

పరకాల: చర్చి మిషనరీ సొసైటీ ఆధ్వర్యంలో పరకాల తాలుకాలో సువార్త సేవలు(సీఎస్ఐ)ను స్థాపించి 100 సంవత్సరాల సంబురాల సందర్భంగా పట్టణంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ పరిశుద్ధ పౌలు నూతనదేవాలయం ప్రతిష్ఠించుకున్న అనంతరం శనివారం వందలాది మంది క్రైస్తవులు అంబేడ్కర్ సెంటర్ నుంచి సీఎస్ఐ చర్చి వరకు దారి పొడవునా యేసు ప్రభువును స్మరించుకుంటూ ర్యాలీలో నృత్యాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటాలతో పాటు డీజే పాటలతో సందడి చేశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సీఎస్ఐ కరీంనగర్ బిషప్, డిప్యూటీ మాడరేటర్ డాక్టర్ రూబెన మార్క్, మధ్య కేరళ అధ్యక్షుడు చెరియన్ బిషప్ డాక్టర్ మలయాలి సాబు మాట్లాడుతూ పట్టణంలో ఎంతో గొప్ప దేవాలయాన్ని ప్రారంభించుకోవడం గర్వంగా ఉందన్నారు. సంఘ సేవలో క్రైస్తవుల సేవలను మరింత బలోపేతం చేయాల్సిన వరం ఉందన్నారు. యేసుక్రీస్తు బోధనలు సమాజ శ్రేయస్సుకు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, శత జయంతి ఉత్సవాల ఇన్‌చార్జ్, ప్రత్యుష్‌బాబు కురియన్, సీఎస్ఐ చర్చ్ బాధ్యులు, పాస్టర్ జాన్, కార్యదర్శి బొచ్చు జాన్సన్, కోశాధికారి బండారి సుగుణాకర్, మడికొండ శ్రీను, బొచ్చు అశోక్, బొమ్మకంటి చంద్రమౌళి, సంజయ్, బొచ్చు కరుణాకర్, ఒంటేరు మధు, సునీల్ గవాస్కర్, పాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ శతజయంతి ఉత్సవాల ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : మార్చి 3, 4వ తేదీల్లో హనుమకొండలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని బీకేఎంయూ సభ్యుడు మద్దెల ఎల్లేష్ కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో శనివారం బీకేఎంయూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేసి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో యువతకు ఉపాధి లేకుండా విద్యావంతులైన యువతీ యువకులు ఉపాధి హామీ పనులకు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని,పట్టణ పేదలకు కూడా ఉపాధి హామీ పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బట్టు మల్లయ్య, కొట్టె ప్రభాకర్, మునిగాల భిక్షపతి, కొటి వెంకటేష్, కొమురయ్య, మర్రిపెల్లి అంకూస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దెల ఎల్లేష్



కాల్వల ద్వారా సాగు నీరందించాలి



ప్రణవ్‌కు సాగునీటి సమస్యను వివరిస్తున్న రైతులు

కమలాపూర్: మండలంలోని శనిగరం, గుంటూర్‌పల్లి, లక్ష్మీపూర్ గ్రామాలకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరందించి తమ పంటలు కాపాడాలని రైతులు కోరారు. ఈ మేరకు ఆయా గ్రామాల రైతులు శనివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌ను హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లోని ఆయన నివాసంలో కలిసి వేడుకున్నారు.డీబీఎం 22ఏ, 22బీ కాల్వల ద్వారా తాము సాగు చేసిన పంటలకు సరిపడా సాగునీరు అందడం లేదన్నారు. దీంతో తమ పంటలు ఎండిపోయే దశకు చేరుతున్నాయని, వారబంధీ కారణంగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సాగునీటి సమస్య ఉందని, శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలని రైతులు కోరారు. ఇందుకు స్పందించిన ప్రణవ్ వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని, సాగునీరు అందించకపోతే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారని, సాగునీరందించి రైతులను ఆదుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని ఎస్సారెస్పీ అధికారులు హామీ ఇచ్చారన్నారు. పంటలకు సరిపడా సాగు నీరందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మంత్రి ఫ్లెక్సీ చించివేతపై వివరణ ఇవ్వాలి

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి శివారు బైరవునిబండ వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరలో రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలను చించివేసిన కాంగ్రెస్ నాయకుడు కాలేరు చిన్నబాబు, ఆయన అనుచరులు మంత్రి ఫ్లెక్సీలను ఎందుకు చించివేశారో సంజాయిషీ ఇవ్వాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ తెలిపారు. వేలేరులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి బీజీ షెడ్యూల్ వల్ల జాతరలో అమ్మవార్లను దర్శించుకోవడానికి రాలేకపోయారని దాంతో ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు మంత్రి ఫ్లెక్సీలను చించివేయడం సమంజసం కాదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో చిన్నబాబు ఫ్లెక్సీలను చించివేశాడని అన్నారు. రెండు రోజుల్లో షోకాజ్ నోటీసులకు సమాధానం చెప్పాలని లేనిపక్షంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొలుగూరి రాజు, ముద్దసాని వరుణ్, రాజు, రాజేందర్, శ్రావణ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి సంపత్

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామం నుంచి పరకాల వరకు నిర్మించబోయే రోడ్డు పనిని శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఏరుకొండ శంకర్, నిమ్మల రమేష్, రవి, రాంరెడ్డి, తిరుపతి రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు